# దేశ విదేశాల్లో... 'దేవకాంచన పుష్పం'

జె. వేణిమాధవి
నేచురలిస్ట్
www.vedicvanas.com



*(గత సంచిక తరువాయి)*

## సరస్వతీ వనం



వాగ్వాణీ వరదా వంద్యా, వరారోహా వరప్రదా।
వృత్తిర్వాగీశ్వరీ వార్తా, వరా వాగీశ వల్లభా॥

విశ్వేశ్వరీ విశ్వవంద్యా విశ్వేశ ప్రియకారిణీ।
వాగ్వాదినీ చ వాగ్దేవీ, వృద్ధిదా వృద్ధికారిణీ॥

గత సంచికలో సరస్వతీదేవి వ్రతంలో వినియోగించే పుష్పాలలో ఒకటైన దేవకాంచనం గురించి వివరాలు తెలుసుకున్నాం. ఈ సంచికలో మరిన్ని విశేషాలు తెలుసుకుందాం. సంస్కృతంలో 'కోవిదారము' అని పిలువబడే ఈ పుష్పం ఎన్నో విశిష్టతలను కలిగివుంది. మన దేశంతో పాటు విదేశాల్లో కూడా ఈ చెట్టు ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకుంది. మన దేశంలోని బీహార్ రాష్ట్ర చెట్టు రావిచెట్టు కాగా, రాష్ట్ర పుష్పం దేవకాంచనం.

మన కేంద్ర ప్రభుత్వం 1981 లో ఈ చెట్టు గుర్తుతో ఒక స్టాంపును ముద్రించింది. దానిపై దేవకాంచనం శాస్త్రీయ నామమైన 'బాహినియా', హిందీ నామమైన 'కచనార్' పేర్లను చూడవచ్చు.







## చైనాలో దేవ కాంచనం

మన పొరుగు దేశమైన చైనాలో దీని ప్రాశస్త్యం మరింత ప్రస్ఫుటంగా చూడవచ్చు. చైనాదేశపు అధికారిక చిహ్నం దేవకాంచన పువ్వు. వారి జెండా మొదలుకొని స్టాంపులు, నాణాలు, కరెన్సీ నోట్లు, స్వర్ణ పతకాలపై కూడా ఈ పువ్వు గుర్తును చూడవచ్చు.






హాంకాంగ్ నగరంలో వారి అధికారి భవంతి వద్ద ఒక ప్రముఖ ప్రదేశముంది. దాని పేరు బాహినియా స్క్వేర్. దేవ–కాంచనం అన్న పేరుకి తగ్గట్టుగా, అక్కడి స్తూపం, బంగారు వర్ణంలో వుండటం విశేషం. ఎగురుతున్న రెండు జెండాల్లో ఒక దానిపై ఈ పువ్వు గుర్తును చూడవచ్చు.



మనిషికి కోపం వచ్చినప్పుడు మంచిచెడులు అర్థంకావు.



ఇక వేరే దేశాలు, దీవులవారు కూడా దేవకాంచనం పేరు మీద స్టాంపులను ముద్రించి, ఆయా ప్రాంతాల్లో దానికున్న విశిష్టతను అధికారికంగా గుర్తించడం గమనించవచ్చు. వాటిపై ఆ దేశాల పేర్లను చూడవచ్చు.






















## స్థల వృక్షం

పలు విశేషాలు గల తిరుమీయచూర్ క్షేత్రంలో బిల్వవృక్షంతో పాటు దేవకాంచనం కూడా స్థలవృక్షంగా వుంది. కావేరీ నది ఒడ్డున వున్న ఈ ప్రదేశానికి రెండువేల సంవత్సరాల చరిత్ర వుంది. ఇది తమిళనాడులోని తిరువారూర్ జిల్లాలో వుంది. ఇక్కడి స్వయంభువుడైన శివుడి పేరు శ్రీ మేఘనాథస్వామి, అమ్మవారి పేర్లు శ్రీ లలితాంబిక, సౌందర్యనాయకి, మనోన్మణి. ఈ క్షేత్ర విశేషాలను జ్ఞాన సంబంధారుడు శ్లోకాల రూపంలో స్తుతించడం జరిగింది.

ఈ క్షేత్రంలో గరుత్మంతుడు, వాలి, సుగ్రీవుడు, యముడు, శనీశ్వరుడు, సూర్యుడి రథసారథైన అరుణుడు జన్మించినట్లు చెప్పబడింది. ఈ కారణం చేత భక్తులు వారి వారి జన్మ నక్షత్రం రోజున ఇక్కడ దీర్ఘాయువు కొరకు ఆయుష్ష, మృత్యుంజయ హోమాలు విశేష రీతిలో జరిపిస్తుంటారు.

## స్థల పురాణం

ఒకప్పుడు కశ్యప మహాముని తన ఇద్దరు భార్యలైన వినత కద్రువలతో కలిసి సత్సంతానం కొరకు శివుని ప్రార్థించాడు. శివుడు వారి భక్తికి సంతసించినవాడై వారికి చెరొక గుడ్డుని ప్రసాదించి, వాటిని సంవత్సరం పాటు జాగ్రత్తగా చూసుకోమని సెలవిచ్చాడు. ఆ ప్రకారమే ఒక సంవత్సర కాలానంతరం వినతకిచ్చిన గుడ్డు నుంచి గరుత్మంతుడు ఉద్భవించాడు. అతడు శ్రీ మహావిష్ణువుకు వాహనమయ్యాడు. ఇదిలా వుండగా, కద్రువకు ఇచ్చిన గుడ్డు నుంచి ఏమీ రాకపోవడం చేత ఆమె తొందరపడి దాన్ని పగులకొట్టి చూడగా దానిలో ఒక అసంపూర్ణమైన శిశువు కనిపించాడు. ఆమె తన తప్పిదాన్ని తెలుసుకొని మరల శివుని ప్రార్థించగా, అతడు ప్రత్యక్షమై ఆమెను క్షమించడమే కాకుండా ఆ శిశువు సూర్యుని రథసారథి అవుతాడని ఆశీర్వదిస్తాడు. అతడే అరుణుడు. అందుచేతనే సూర్యోదయాన్ని అరుణోదయం అని కూడా పిలుస్తారు.


మహా శివభక్తుడైన అరుణుడు శివుని దర్శనం కొరకు తపమాచరిస్తుంటాడు. సూర్యుడు అతడిని చూసి శారీరక లోపాలతో కైలాసానికి వెళ్లి శివుడిని దర్శించడం సాధ్యం కాదని హేళన చేసాడు. ఆ మాటలను లెక్కజేయక తన తపస్సును కొనసాగించి, చివరకు శివుని దర్శనాన్ని అరుణుడు పొందాడు. అరుణుడిని హేళన చేసిన సూర్యుడిని శివుడు శపించడం చేత అతడు తన కాంతి, తేజస్సులను కోల్పోయాడు. సూర్యుడు తన తప్పిదానికి పశ్చాత్తాపపడి, శివపార్వతులను ఏనుగుపై అధిరోహింప చేసి, పూజలొనర్చినా కూడా తన తేజోకాంతులు తిరిగి పొందలేకపోయాడు. అంధకారంలో వున్న సూర్యుడు శివుని వద్దకు వచ్చి ఆక్రోశిస్తుండగా, అమ్మవారు కోపగించుకున్నట్లు, అంతట శివుడు అమ్మవారిని బతిమాలి, బుజ్జగించి, సూర్యునికి తేజస్సు కాంతులను అనుగ్రహించినట్లు స్థలపురాణంలో చెప్పబడింది.

సూర్యుడు తిరిగి తన కాంతిని పొందడమే 'మీయచూర్' అన్న పదానికి అర్థం. ఈ గుడి గోపురం గజబృష్ఠ విమాన ఆకారంలో



సముద్రాన్ని ఇంకింపచేయలేరు. సూర్యుడిని ఆపలేరు. గాలిని బంధించలేరు. అలాగే మూర్ఖుడిని బాగుచేయలేరు.





వుండటం గమనార్హం. శివుడు అమ్మవారిని బతిమాలుతున్న విగ్రహాన్ని కూడా ఈ క్షేత్రంలో చూడవచ్చు. అమ్మవారు ఒక కోణంలో కోపంగాను, మరొక కోణంలో సౌమ్యంగాను కనిపించడాన్ని భక్తులు విశేషంగా భావిస్తుంటారు. రథసప్తమి రోజు ఇక్కడ విశేషమైన పూజలు నిర్వహిస్తారు. చైత్రమాసంలో సూర్యుని కిరణాలు మేఘనాథుని రూపంలో వున్న శివునిపై పడతాయి.

## శ్రీ లలితా సహస్రనామ స్తోత్రం

ఒకప్పుడు పండాసురుడు అనే రాక్షసుడు ఋషులు, మునులు, దేవతలను హింసిస్తుండేవాడు. వారందరూ శ్రీ ఆదిపరాశక్తిని శరణాగతి వేడగా, ఆమె శ్రీ లలితాంబికా రూపంలో యజ్ఞగుండం నుంచి ఉద్భవించి శ్రీచక్ర రథాన్ని అధిరోహించి పండాసురుడిని అంతమొందించింది. అప్పుడు శివుడు ఆమె రౌద్రత్వం తగ్గడానికి మనోన్మణి అన్న పేరుతో భూలోకంలో తపస్సు చేయమనగా, ఆమె ఈ ప్రదేశానికి వచ్చి తపస్సు చేసినట్లు స్థలపురాణంలో వుంది. ఆ క్రమంలో అమ్మవారు వాక్ దేవతలను సృష్టించి, తనని స్తుతించమన్నారు. అదే మనం ఇప్పుడు పఠిస్తున్న దివ్యమైన శ్రీ లలితా సహస్రనామ స్తోతం.

వేరొక పురాణంలో ఈ విధంగా చెప్పబడింది. అమ్మవారి భక్తుడైన హయగ్రీవుడు శ్రీ లతితా సహస్రనామ స్తోత్రాన్ని, దాని మాహాత్మ్యాన్ని శ్రీ అగస్త్య మహామునికి తెలియజెప్పాడు. అప్పుడు అగస్త్యుడు ఈ స్తోత్రాన్ని ఎక్కడ పఠిస్తే విశేష ఫలితాలుంటాయో తెలుపమనగా, హయగ్రీవుడు తిరుమీయచూర్ క్షేత్రంలోని శ్రీ లలితాంబికాదేవి సమక్షంలో దీనిని పఠించడం ఉత్తమోత్తమం అని సెలవిచ్చాడు. అంతట అగస్త్యుడు తన భార్య అయిన లోపాముద్రతో కూడి ఈ క్షేత్రానికి విచ్చేసి శ్రీ లలితాంబికాదేవి ఎదుట స్తుతించగా, అమ్మవారు ప్రసన్నురాలై నవరత్నాల రూపంలో దర్శనమిచ్చింది. దానికి పరవశుడైన అగస్త్యుడు ఆశువుగా శ్రీ లలితా నవరత్నమాలికను గానం చేశాడు. యమధర్మరాజు కూడా ఈ క్షేత్రంలో 1008 శంఖాల తీర్థంతో శివుడిని అభిషేకించి అతడి అనుగ్రహానికి పాత్రుడయ్యాడని తెలియవస్తోంది.





ఇంతటి ప్రాశస్త్యం కలిగి రెండువేల ఏండ్ల చరిత్ర వున్న తిరుమీయచూర్‌లో స్థలవృక్షంగా బిల్వవృక్షంతో పాటుగా దేవకాంచనం పూజలందుకోవడం అత్యంత విశేషం. మన ప్రాంతాల్లో దేవకాంచనం రహదారుల వెంబడి విరివిగా కనిపిస్తుంది. వాటిని మనం గుర్తించగలిగితే శ్రీ లలితాదేవి, సరస్వతీదేవిల అనుగ్రహం మనపై వున్నట్లే. అనువైన సమయాల్లో ఈ దివ్యవృక్షాన్ని దర్శించుకొని ఆదరించవచ్చు. ఆ పుష్పాలని కూడా పూజలో వినియోగించి సద్బుద్ధి, విద్య, ఆయురారోగ్యాలను పొందవచ్చు. *మరిన్ని విశేషాలు వచ్చే సంచికలో చూద్దాం.*